

టిడిపి అధ్యక్షునికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - తాళ్లరేవు


గుత్తుల సాయిని సత్కరిస్తున్న నాయకులు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షునిగా ఎన్నికైన గుత్తుల సాయికి టిడిపి నాయకులు, కార్యకర్తల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఆయనను పలు వురు కలిసి సత్కరించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్, టేకుమూడి లక్ష్మణరావు, వేగేశ్న బాస్కరరాజు, మందాల గంగ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ కాల సూరిబాబు, దంగేటి అన్వేష్ పాల్గొన్నారు.

యూరియా దొరికేనా..?

- రబీ సాగుకు రైతుల సన్నద్ధం
- ఖరీఫ్ పంటకు తప్పని కొరత
- బ్లాక్ అమ్మకాలు చేసిన ప్రయివేటు డీలర్లు
- అష్టకష్టాలు ఎదుర్కొన్న అన్నదాతలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గడచిన ఖరీఫ్ పంటకు ఎరువుల కొరతతో రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. యూరియా పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో అనేక ఇక్కట్లకు లోనయ్యారు. బ్లాక్‌లో కొందామన్నా యూరియా లభించని పరిస్థితి ఏర్పడింది. అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శలు లేకపోలేదు. ఆశించిన స్థాయిలో దిగుబడి రావాలంటే సమయానికి యూరియా తప్పనిసరి. అందుకోసం రైతన్నలు సొసైటీలు, ఆర్‌ఎస్‌కెల వద్ద క్యూ కట్టారు. అయినా ఎరువులు అందరికీ అందిన పరిస్థితి లేదు. ఇదే అదునుగా ప్రయివేటు డీలర్లు పురుగులు మందులు కొంటేనే యూరియాను ఇస్తామనే షరతులతో రైతులను తీవ్ర ఇక్కట్లకు గురి చేశారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రబీ సాగు మొదలైంది. రబీ సాగుకు యూరియా, ఇతర ఎరువుల అవసరం ఎంతైనా ఉంది. గత సమస్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో అనే చర్చ నేడు ప్రారంభం అయింది. అవసరానికి సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని అన్నదాతలు కోరుతున్నారు.

రైతన్నలకు తప్పని కష్టాలు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎన్నడూ లేనివిధంగా రైతన్నలు యూరియా కోసం అనేక కష్టాలు పడ్డారు. ఖరీఫ్ సీజన్లో సుమారు 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అందుకు తగినట్లుగానే విడతలవారీగా యూరియాను అందుబాటులో ఉంచామంటూ ప్రకటనలు చేశారు. అయితే క్షేత్ర స్థాయిలో రైతులు పలు ప్రాంతాల్లో యూరియా కోసం సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రయివేటు డీలర్ల దుకాణాల వద్ద బారులు తీరారు. రోజులు తరబడి యూరియా కోసం తిరిగినా దొరకని దుస్థితి నెలకొంది. ఎకరాకు 60 రోజులు వ్యవధిలో కేవలం ఒక బస్తా యూరియా వాడితే సరిపోతుందని అధికారులు చెప్పుకొస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో సరిపడా యూరియా అందక దిగుబడులను కోల్పోవలసి వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్‌లో కొనుగోలు చేద్దామని తిరిగినా రైతులకు కష్టాలు తప్పలేదు.


గొల్లప్రోలులో క్యూ కట్టిన రైతులు(ఫైల్‌ఫోటో)

రబీలో ఇబ్బందులు తొలగుతాయా.?

జిల్లాలో ఈ ఏడాది రబీలో సుమారు 3 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలను రైతులు పండించనున్నారు. 35,576 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు 14,861 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు 10,149 మెట్రిక్ టన్నులను సరఫరా చేశామని అధికారులు చెబుతున్నారు. ప్రయివేటు రిటైల్ డీలర్లు వద్ద 2,112 మెట్రిక్ టన్నులు, సొసైటీల వద్ద 641 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల్లో 1188 మెట్రిక్ టన్నులు, ప్రయివేటు హోల్ సేల్ డీలర్లు వద్ద 56 మెట్రిక్ టన్నులు, ఏపి మార్కెఫెడ్ వద్ద 678 మెట్రిక్ టన్నులు మొత్తంగా 4,675 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇతర ఎరువులు మరో 9205 మెట్రిక్ టన్నులు అందు బాటులో ఉన్నాయి. అయితే అధికారులు లెక్కల్లో మాత్రం పెద్దఎత్తున యూరియా నిల్వలు ఉన్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం రైతుల ను కొరత వేధిస్తూనే ఉంది. యూరియా కొరతతో అదనపు భారం తప్ప డం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీలో యూరియా కొరత ఉండదని అధికారులు ప్రకటనలు చేస్తున్నా రైతుల్లో ఆందోళన తప్పడం లేదు.

'నానో'పై నమ్మకం లేదా..?

సాంకేతికంగా ఇటీవల అభివృద్ధి చేసిన నానో యూరియా, నానో డిఎపి ఎరువులను అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం 722 లీటర్ల నానో యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. సాంప్రదాయ ఎరువులకు నూరు శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సాహిస్తున్నాయి. అయితే నానో ఎరువులపై రైతులు నమ్మకం కుదరడం లేదు. దీనిపై అధికారులు సైతం రైతులకు సరైన అవగాహన కల్పించలేక పోతున్నారు. నానోను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఎరువులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడం లేదని, అందులో ప్రధానంగా యూరియా ఒకటనే అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.



ధర్నా శిబిరం వద్ద మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ మాట్లాడారు. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులంతా టెట్‌లో ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఆ తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని రాష్ట్ర విద్యా శాఖామంత్రి చెప్పారని, కానీ ఆచరణలో ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖామంత్రి కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసిన సందర్భంలోనైనా ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ ఎస్ఎస్‌సి 100 రోజుల ప్రణాళికలో రెండవ శనివారం, ఆదివారం, పండుగ సెలవులు మినహాయించాలని డిమాండు చేశారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని బట్టి 100 రోజుల ప్లాన్‌ను మార్పు చేసి సెలవులను మినహాయించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నగేష్ మాట్లాడుతూ బదిలీలు జరిగి 6 నెలలు గడిచినా ఇప్పటికీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదని, వెంటనే ప్రభుత్వం అకడమిక్ ఇన్స్ట్రక్టర్స్‌ను నియమించి ఆయా ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.సాయిరాం మాట్లాడుతూ సింగిల్ టీచర్లకు కనీసం ఒకరోజు సెలవు పెట్టుకోవటానికి ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఆ ఇబ్బంది నుంచి బయటపడేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిఇఒను కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎన్.గోవిందరాజులు, సిఐటియు నాయకులు పి.వీరబాబు, మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ నుంచి డిఇఒ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. డిఇఒకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు బి.నాగమణి, పివిఎన్.గణేశ్వరరావు, టి.సీతారామయ్య, ఆర్.జయప్రకాష్, కె.పెద్దిరాజు, జి.నాగరాజు, పివివి.సత్యానారాయణ, డి.కనక దుర్గాదేవి, ఎ.సీతారామరాజు. టి.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట

సైబర్ నేరాలపై అప్రమత్త అవసరమని డిఎస్‌పి శ్రీహరిరాజు అన్నారు. గురువారం స్థానిక అక్షర విద్యా సంస్థలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేస్తుంటారని, డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో ఎక్కడా లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులు, ఎపికె ఫైల్స్ క్లిక్ చేయవద్దన్నారు. మీ బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు ఎవరికీ ఇవ్వరాదన్నారు. పార్ట్ టైం జాబ్ ఆఫర్‌తో వచ్చే ప్రకటనల పట్ల జాగ్రత్త వహించాలని, అపరిచిత వ్యక్తులు నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను లిఫ్ట్ చేయరాదన్నారు. సైబర్ క్రైమ్ గురించి, నేరగాళ్లపై ఫిర్యాదుకు 1930 నెంబర్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వైఆర్‌కె. శ్రీనివాస్, అక్షర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీహరిరాజు

మొండి బకాయిలపై చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం

మున్సిపాలిటీలో పేరుకుపోయిన మొండి పన్ను బకాయిల వసూలుకు అధికారులు దృష్టి సారించారు. మున్సిపల్ కమిషనర్ బి రాజు ఆదేశాలతో గురువారం పలు ప్రాంతాల్లో బకాయి దారుల ఇంటి కుళాయిల కనెక్షన్లు తొలగించారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయి ఉన్న వారికి ఆక్యుపెన్సీ నోటీసు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారి వైవి.మోహనరంగా తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలలో సుమారు ఖాళీ స్థలం పన్నులు రూ.25 లక్షలు, ఇంటి పన్నులు రూ.79 లక్షలు, షాపు అద్దె బకాయిలు రూ.47 లక్షలు, కుళాయి పన్నులు రూ.85 లక్షలు వసూలు చేసినట్టు తెలిపారు. మున్సిపాలిటీకి చెల్లించవలసిన అన్ని రకాల బకాయిలు తక్షణం చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి.తిరుమల, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన బిసి సంక్షేమ అధికారి

ప్రజాశక్తి - కాకినాడ

కుటుంబ పెన్షన్ ఖరారు, కారుణ్య నియామకం కోసం లంచం డిమాండ్ చేసి స్వీకరించిన కేసులో జిల్లా బిసి సంక్షేమ అధికారితో సహా ముగ్గురిని ఎసిబి అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం అడవిపేట గ్రామానికి చెందిన గెద్దాడి చక్రవర్తి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఫిర్యాదు తండ్రి గెద్దాడి అంబేద్కర్ ఈ ఏడాది జూలై 23న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఐ.పోలవరం మండలంలోని బిసి సంక్షేమ హాస్టల్‌లో కుక్‌గా పనిచేశారు. ఆయన మృతి చెందిన అనంతరం కుటుంబ పెన్షన్ ఖరారు చేయడం, ఫిర్యాదుదారి సోదరుడు గెద్దాడి ధర్మతేజకు కారుణ్య నియామకం కల్పించేందుకు జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎం.లల్లి, సీనియర్ అసిస్టెంట్ కారపు ఎస్ఎస్ ప్రసాద్ కలిసి రూ.60 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. అందులో మొదటగా రూ.40 వేలు ఇవ్వాలని కోరారు. లంచం ఇవ్వడానికి నిరాకరించిన ఫిర్యాదుదారు ఎసిబిని ఆశ్రయించారు. గురువారం స్థానిక బిసి సంక్షేమ కార్యాలయంలో ప్రయివేట్ మధ్యవర్తిగా వ్యవహరించిన రిటైర్డ్ ఉద్యోగి యాదల సత్యనారాయణ ద్వారా రూ.40 వేల లంచం తీసుకునే సమయంలో ఎబిసి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేశారు. నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. అరెస్టు చేసిన వారిని రాజమహేంద్రవరం ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. లంచం లేదా అవినీతికి సంబంధించిన సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1064, మొబైల్ నంబర్ 9440440057కు సమాచారం ఇవ్వాలన్నారు.


ఎసిబికి చిక్కిన నిందితులు

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

ప్రజాశక్తి - కాకినాడ

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్ ఆదేశించారు. ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం సన్నద్ధతపై నగరంలోని రామారావుపేటలోని యుపిహెచ్‌సిలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లందరికీ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. శనివారం సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలంటీర్లతో అవగాహన ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. పిల్లలందరికీ మొదటి రోజు పోలియో భూత్‌లలోనే నూరు శాతం పూర్తి చేయాలనీ, రెండవ, మూడవ రోజుల్లో సిబ్బంది గృహాల సందర్శనల ద్వారా మిస్సింగ్ పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ప్రతీ పోలియో బూత్‌ని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ తెరచి ఉంచాలని, వాక్సిన్ వేసే ముందు వివియంని తప్పనిసరిగా గమనించాలని ఆదేశించారు. మత్స్యకార కాలనీలు, మురికి వాడలు, అపార్ట్‌మెంట్స్, హార్డ్ టు రీచ్ ఏరియాలలో మొబైల్ టీం ద్వారా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ కెవి.సుబ్బరాజు, డిఎంఒ డాక్టర్ ఐ.ప్రభాకర్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, డిప్యూటీ డెమో కె.సూర్యచంద్రరావు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశ:లో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నరసింహానాయక్

రూ.60 లక్షలతో చెరువుల అభివృద్ధి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులను రూ.60 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి బి.గోపీచంద్ తెలిపారు. డిసిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో గురువారం మండలంలోని ఎండపల్లి, వాకతిప్ప, కొమరగిరి చెరువులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ పథకం 2.0 ద్వారా 50 లక్షలు, ఎన్ఆర్ఇజిఎస్‌లో రూ.10 లక్షలతో చెరువుల అభివృద్ధిలో భాగంగా గట్టులు బలపరచడం, రివిట్‌మెంట్, పార్క్, వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు, మొక్కలు పెంచడం వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్క్యూసిఒ జెబివిబి.సురేష్, పథకం సంచాలకులు అడపా వెంకటలక్ష్మి, క్లస్టర్ అసిస్టెంట్ సంచాలకులు వసంతమాధవి, ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటు లెక్చరర్‌కు పిటిఎల్‌యు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పిఠాపురం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న యూనియన్ సభ్యులు

ఇటీవల అస్వస్థతకు లోనై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఓ ప్రయివేటు కళాశాల లెక్చరర్ కె.యేసురత్నంకు ప్రయివేటు టీచర్లు, లెక్చరర్ల యూనియన్ అండగా నిలిచింది. యూనియన్ సభ్యుల సహకారంతో రూ.50 వేలను నాయకులు సేకరించారు. సేకరించిన మొత్తంలో కొంత నగదుతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి మిగిలిన మొత్తాన్ని గురువారం యూనియన్ నాయకులు యేసురత్నంకు అందజేశారు. ధైర్యంగా ఉండాలని యూనియన్ నాయకులు భరోసా ఇచ్చారు. ప్రయివేటు ఉపాధ్యాయులు, లెక్చరర్లకు ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్య భద్రత అవసరమని, ప్రతీ ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఆయా సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు పి.కృష్ణారావు, రాష్ట్ర సమన్వయకర్త పి.కిరణ్‌కుమార్‌రాజు, నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనుబాబు, పి.వీరబాబు, వి.నరసింహారావు, పి.లక్ష్మణ్, వి.సురేష్, కె.అమృత్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 1400 స్పోర్ట్స్ కిట్స్‌ను గురువారం అందజేసినట్లు ఎంఇఒ-2 పి.పుల్లయ్య చెప్పారు. మండలంలోని ఆరు కాంప్లెక్సుల పరిధిలోని పాఠశాలలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎం, సిఆర్‌పిల ద్వారా అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలకు హైజంపు పోల్స్, బ్యాడ్మింటన్ కోర్ట్స్, బ్యాడ్మింటన్ సర్కిల్ రాకెట్లు, క్యారం బోర్డు సెట్లు, చెస్ సెట్లు, వుడెన్, ఫైబర్ క్రికెట్ బ్యాట్లు, ప్లాస్టిక్ స్టెప్స్ సెట్లు, సాఫ్ట్ టెన్నిస్ బాల్స్, వుడెన్ స్టెమ్స్ సెట్లు, ఫుట్‌బాల్ పంపులు, హ్యాండ్‌బాల్స్, వెయిటింగ్ మెషిన్, స్టెప్పింగ్ రోప్స్, టేబుల్ టెన్నిస్, టేబుల్ ఫర్ టేబుల్ టెన్నిస్ రింగ్స్, త్రో బాల్స్, వాలీబాల్స్, యోగా మ్యాట్స్ తదితర అనేక ఆటవస్తువులను పంపిణీ చేశారు.


క్రీడా కిట్లు అందజేస్తున్న ఎంఇఒ పుల్లయ్య

మహిళా సంక్షేమం కోసం కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

మహిళా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు అన్నారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో పిఎం ఉజ్వల యోజన పథకంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ, జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, నాయకులు దుర్గా మోహన్‌రావు, నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, తాళాబత్తుల సాయి, గడ్డం పెద్దకాపు, వంగలపూడి సతీష్, నల్లల నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకి స్టౌవ్‌ను అందజేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

20న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పలు గ్రామాలలో ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పి.మల్లవరం, పత్తిగొంది, జార్జిపేట, ఎంఎల్‌కె.నగర్, నీలపల్లి. పోలేకుర్రు, గాడిమొగ పంచాయతీలోని గ్రామాలు, ఐ. పోలవరం మండలం భైరవ-పాలెం, తాళ్లరేవు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినోద్ మిశ్రాకు ఘన నివాళి

ప్రజాశక్తి - రౌతులపూడి


సిపిఎం లేబరేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వినోద్ మిశ్రా 27వ వర్థంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల కార్యదర్శి కామిరెడ్డి నారాయణమూర్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం ప్రజాస్వామ్య ప్రమాదంలో ఉన్నాయని, వీటిని కాపాడుకునేందుకు వామపక్ష ప్రజాస్వామ్యశక్తులు ఐక్యత ఎంతో అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.సాయిలక్ష్మి, తిపరాల రత్నం, పందిరి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్, మండల న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ హెల్ప్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సు పాఠశాల హెచ్‌ఎం ఎం.రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో బాల్య వివాహాల వల్ల అనర్థాలు, నష్టాలు, అనారోగ్య సమస్యలపై చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్యానల్ లీగల్ అడ్వకేట్ మడికి రాంబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ నూతలపాటి అప్పలకొండ, క్రాప్ స్వచ్ఛంద సంస్థ సోషల్ వర్కర్ బి.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్టూ'నిజం'



విద్యార్థుల ప్రతిభకు వేదిక 'థండర్ థర్స్‌డే'

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి 'థండర్ థర్స్‌డే' ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోందని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం అదిత్య విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (ఎస్ఎసి) ఆధ్వర్యంలో అభినయ క్లబ్ 'థండర్ థర్స్‌డే' కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటకం, కవిత్వం, కథనాలు, మిమిక్రీ, స్టాండ్-అప్ కామెడీ, యాంకరింగ్, కళలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో స్టేజ్ భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ డి.కిషోర్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ పరంజీత్ సింగ్, సౌత్ కొరియా ప్రతినిధి డాక్టర్ యు టాక్ లీ, తదితరులు పాల్గొన్నారు.




నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఉద్యమ ఆధార్‌తో చిరు వ్యాపారులకు మేలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉద్యమ ఆధార్‌తో చిరు వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని జిఎండిసి ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి రాజేష్ అన్నారు. గురువరం స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంపెయిన్ జరిగింది. ఈ సదర్భంగా మండలంలోని వివిధ గ్రామ సమాఖ్యల నుంచి వచ్చిన 70 మంది మహిళలకు రిజిస్ట్రేషన్లు చేసి ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిఎంలు విజయలక్ష్మి, కెవికె.శైలేష్, సిసిఎస్‌లు పాల్గొన్నారు.


నూతన ఛైర్మన్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

సిబ్బంది సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ

గ్రంథాలయ సంస్థ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జివిఆర్ఎస్‌హెచ్‌కె.వర్మ, గౌరవ అధ్యక్షులు సలాది సాయి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు రేపాక వెంకటరాము గురువారం మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామంలో నూతన అధ్యక్షులు ఈశ్వరరాజువర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గ్రంథాలయాల సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జివివిఎన్.త్రినాథ్, ప్రచార కార్యదర్శి ములంపాక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.కిషోర్, కె.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కె.పద్మజ, బి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - చాగల్లు

నిడదవోలు నుంచి పంగిడి వైపు వెళ్తున్న పాల లారీ బుధవారం రాత్రి రెండున్నర గంటల సమయంలో వెంకట రామ థియేటర్ సెంటర్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎగిరి పడింది. ఈ ఘటనలో ఎవరు ఎటువంటి ప్రమాదానికి గురికాలేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టారు.



చెక్‌ను అందిస్తున్న విద్యానికేతన్ కరస్పాండెంట్

బాధితునికి ప్రతిభ విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సామర్లకోట

లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక బాలుడి వైద్య ఖర్చుల కోసం స్థానిక ప్రతిభ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు చేయూతను అందించారు. పట్టణంలోని బలుసులపేటకు చెందిన బాలుడు పేరూరి సాయికుమార్ లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న ఆ బాలుడి పరిస్థితిని ఇటీవల మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో స్థానిక ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులు మానవతా హృదయంతో ముందుకొచ్చారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల సహకారంతో రూ.70 వేలను సమీకరించారు. ఆ మొత్తాన్ని గురువారం ప్రతిభ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎస్‌విజి.ప్రకాష్ చేతుల మీదుగా బాధితుని తల్లిదండ్రులకు అందజేశారు. ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థుల సేవాభావాన్ని పలువురు అభినందించారు.



లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న అధ్యాపకులు

లక్ష్మీనారాయణ ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాల అసోసియేషన్ కోశాధికారిగా లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన భౌతిక శాస్త్ర లెక్చరర్ లక్ష్మీనారాయణ అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నికైన సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపల్ శేషావరావు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వాటర్ డెస్పెన్సర్‌ను అందజేస్తున్న బ్యాంకు అధికారి

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి పర్యాటక కేంద్రానికి స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెండు వాటర్ డిస్పెన్సర్‌లను బహూకరించింది. గురువారం బ్యాంకు మేనేజర్ డి.శ్రీనివాస్ రూ.18 వేలు విలువ చేసే 2 డిస్పెన్సర్‌లను ఫారెస్ట్ బీట్ అధికారులు పి.సంధ్యారాణి, సిహెచ్.ధనలక్ష్మిలకు అందజేశారు. ఈ యంత్రాల వల్ల సురక్షితమైన వేడి నీటితో పాటు చల్లని నీరు వస్తుందన్నారు. సిఎస్‌ఆర్ నిధుల నుంచి వాటర్ డిస్పెన్సర్‌లను అందజేసిన యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ బిజిఆర్.నాయుడు, డిప్యూటీ రీజినల్ హెడ్ వి.కృష్ణ మాచారి, మేనేజర్ డి.శ్రీనివాస్‌లకు అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - సామర్లకోట

పొలంబడి నాలుగు సూత్రాలు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించగల్గుతారని వ్యవసాయ శాఖ ఎఒ వంగపండు మురళీధర్ అన్నారు. గురువారం మండలంలోని వేట్లపాలెంలో 14 వారాలపాటు నిర్వహించనున్న జిఎపి పొలంబడి కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో పొలంబడి కార్యక్రమాలకు రైతులు హాజరై తక్కువ పెట్టుబడితో అధిక పంట సాధించేలా కృషి చేయాలన్నారు. బ్యాలెట్ పెట్టే పరీక్ష, వివిధ చీడపీడలు, పొలం పరిసరాలు విశ్లేషణ, భాగస్వామ్య కార్యచరణ, పరిశోధనా బృంద విన్యాసాలు, వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు శాంతికమల, రూప, విఎఎ శ్రీనివాస్‌ప్రవీణ్, సమన్వయకర్త వీర్రాజు, రైతులు పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన జివి.రావు

ప్రజాశక్తి - రామచంద్రపురం

డిఇఒ పి.నాగేశ్వరరావును బుధవారం ప్రయివేటు విద్యాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు, మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.సత్తిబాబుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జివి.రావు డిఇఒ నాగేశ్వరరావుకి వివరిం చారు. ప్రయివేటు పాఠశాలల నిర్వహణ ప్రక్రియలో నియమ నిబంధనలను సరళీకృతం చేయవలసిన అవసరం ఉందని జివి.రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి తనవంతు కృషి చేస్తున్న జివి.రావు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని డిఇఒ నాగేశ్వ రరావు పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - కోటనందూరు



ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న యనమల దివ్య

రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ యనమల దివ్య అన్నారు. గురువారం మండలంలోని కాకరపల్లి గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. ఆయా శాఖ అధికారులు కొన్నింటిని తక్షణమే పరిష్కరించారు. ఆ మండలంలో సిసి రోడ్లను, డ్రయినేజీ నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, మిగిలిన వాటిని దశలవారీగా నిర్మాణాలు చేపడతామని అన్నారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను స్కీములు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంటుపల్లి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు సామినేడి కృష్ణార్జున, వాసం నాగేశ్వరరావు, యనమల రాజేష్, చింతనీడి అబ్బాయి, గాడి రాజబాబు, పోతల సూరిబాబు, అంకంరెడ్డి రమేష్, పెనుమచ్చ నాగేశ్వరరావు, వెలగా వెంకటకృష్ణారావు, దంతులూరి చిరంజీవిరాజు, కనిగిరి త్రిమూర్తులు, షేక్ నవాబ్ జానీ, పెనుమచ్చ ప్రవీణ్, పెదపాత్రుని శ్రీనివాస్, అంకారెడ్డి రాజశేషు, సుర్ల సావిత్రి, బుల్లిబాబు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



కార్డులను అందజేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం మండలంలోని టి.రాయవరంలో రైతులకు యూరియా కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో రైతులు వ్యవసాయంపై ఎక్కువ ఆధారపడతారని, పంటలను లాభసాటిగా మార్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వ 18 నెలల కాలంలో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఏలేరు తోటలు పండించే రైతులకు యూరియా సరఫరాపై కలెక్టర్‌తో మాట్లాడతానని అన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ జి.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి జోకా అమృత, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డ్ వైస్ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, సర్పంచ్ సుబ్బారావు, అమరాది వెంకట్రావు, సాగర్ ఛైర్మన్ ఇళ్ల అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - కరప



రైతులతో మాట్లాడుతున్న జెసి అపూర్వభరత్

మండలంలోని పాతర్లగడ్డ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ధాన్యం పట్టుబడి కళ్లం వద్ద పట్టుబడి జరుగుతున్న తీరు, కొనుగోలు కేంద్రాల పనితీరును రైతులను కలిసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూర్తోయిన డ్రైన్‌లను పరిశీలించారు. అధికారులకు విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో తహాశీల్దార్ టి.దుర్గాప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, విఆర్‌ఒ మేడిశెట్టి కిషోర్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బిసిలకు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ



సుమన్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బిసిలకు డిప్యూటీ సిఎం పదవులు ఇవ్వాలని సినీనటుడు సుమన్ కోరారు. గురువారం వీర కమల్ థియేటర్ ప్రాంగణంలో బిసి సంఘం ఆధ్వర్యంలో సంకల్ప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బిసిలకు రిజర్వేషన్ కల్పించారని, అయినా నేటికీ కొన్ని కులాలకు రాజ్యాధికారం దక్కలేదని అన్నారు. అటువంటి కులాలను గుర్తించి వారికి రాజకీయ ప్రాధాన్యతను కల్పించేందుకు అన్ని రాజకీయపార్టీలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షులు శొంటి నాగరాజు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలోని అన్ని కులాలకు రిజర్వేషన్ దక్కేలా కృషి చేస్తామన్నారు. అనంతరం సుమన్‌ను సత్కరించారు. బిసి రత్న అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు కర్రి గోపాలకృష్ణ, మాకిరెడ్డి భాస్కర్‌గణేష్‌బాబు, రాయుడు నాగేశ్వరరావు, పెంకె రాజు, సర్పవరం సర్పంచ్ శీలం నాగేశ్వరరావు చిన్నా, కొండా వినాయక్, ఆవుపాటి ఉమాశంకర్, అనసూరి సతీష్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కరప



కాలువ పనులను పరిశీలిస్తున్న డిసి ఛైర్మన్

రబీ సాగుకు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ పుణ్యమంతుల గంగాసత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలో జరుగుతున్న కాలువల ఆధునికీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జరిగిన ఇరిగేషన్, డ్రయినేజీ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో సాగునీటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తగు నిర్ణయాలు చేయడం జరిగిందన్నారు. కరప, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.బావవరం గ్రామాలకు శహపురం అక్కిరేవు నుంచి పారే కాలువల పనులను శుక్రవారం ప్రారంభిస్తామని అన్నారు. మండల పరిధిలో పంట కాలువలు, డ్రయిన్లు గత ఐదేళ్లుగా సరిగా లేకపోవడంతో శహపురం అక్కిరేవు నుంచి పై గ్రామాలకు నీరు ఆటంకం కలిగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళీ, మండల వైస్ టిసి మెర్ల వీరవెంకటప్రభాకర్‌చౌదరి, జడ్ బావవరం సొసైటీ ఛైర్మన్ గంట వీరన్నచౌదరి, గోన ఆంజనేయులు, బత్తుల సతీష్, వీరమరెడ్డి ముత్యాలరావు, రైతులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లాలో సపాయి కర్మచారి వృత్తిలో జీవనం సాగిస్తున్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్‌కెడిపి పథకంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల నిమిత్తం సబ్సిడీపై రుణాలు మంజూరు కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఐదుగురు ఒక గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సభ్యుని యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఐదుగురు గ్రూపు సభ్యులు సపాయి కర్మచారి సర్టిఫికెట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఐదుగురిలో ఒకరికి హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. డిసెంబర్ నెలాఖరులోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు ఈ క్రింది ఫోన్ 6281817023 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక కొత్తపేట ప్రాంతంలో నిర్వహిస్తున్న చర్చ్ కార్యకలాపాలు నిలిపివేయాలని కోరుతూ విహెచ్‌పి ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు చేతులూరి గవరరాజు యువతుల భీముడు మాట్లాడుతూ కొత్తపేట ప్రాంతంలో మూసివేసిన చర్చిలో కార్యాకలాపాలకు అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. దీనిపై తహాశీల్దార్ రామ్‌కుమార్ ఆర్‌డిఒకు ఫోన్లో సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై చర్చించేందుకు శనివారం ఉదయం 11 గంటలకు కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి రావాలని కోరినట్లు తహాశీల్దార్ వారికి వివరించారు. ఈ ఆందోళనతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కొత్తపేటలో 144 సెక్షన్ అమలు

స్థానిక కొత్తపేట ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉందని తహాశీల్దార్ రామకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులు నిలుపుదల చేసేంత వరకూ ఆ ప్రాంతంలో ప్రజలు నలుగురు కంటే ఎక్కువగా గుమి కూడదని అన్నారు. ఎటువంటి ఆయుధాలతోనూ రోడ్లపైకి రాకూడదని తెలిపారు. ప్రశాంత వాతావరణం నెలకొనే వరకూ ప్రజలు సహకరించాలని కోరారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద హిందూ సంఘాల నిరసన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటనను విడుదల చేశారు.

శ్రీనివాస్‌రెడ్డికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధి బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. గుజరాత్‌లో జరుగుతున్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎపి.సింగ్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 100 శాతం సభ్యత్వ నమోదు చేయడంతో పాటు నిరంతరాయంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపునివ్వడం ఆనందదాయకమన్నారు. అవార్డు అందుకున్న ఆయనకు మండలంలోని పలువురు నాయకులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పదో తరగతి మోడల్ పేపర్ల పంపిణీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాడిపత్రి, వన్నెపూడి హైస్కూల్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో కార్తికేయ హాస్పిటల్, అపర్ణ సేవ ట్రస్ట్ సంయుక్త సహకారంతో 140 మంది విద్యార్థులకు మోడల్ పేపర్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జి.నాగమణి, రాజేంద్రప్రసాద్, కార్తికే హాస్పటల్ డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, సాంబశివరావు, అపర్ణ సేవా ట్రస్ట్ ఛైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ, తుమ్మూరి శ్రీరామారావు, ఆకొండి ప్రభాకర్‌శాస్త్రి, గ్రంధి రమేష్, యుటిఎఫ్ నాయకులు జిఎస్‌ఎన్.మూర్తి, వివి.శంకర్, దాసం శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాం వార్తలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల అధ్యాపకులు

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

ఐసిడిఎస్, చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల అనార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పోలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సంసాని రవికుమార్ బాల్య వివాహాల వల్ల జరిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్డులో గురువారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వమించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవ. బిహెచ్‌వి.మూర్తిరాజు పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి భారీ క్రిస్మస్ కేకును కట్ చేశారు. అనంతరం ఆయన అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

డిపాజిట్లపై ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - యానాం

స్థానిక సర్వశిక్ష అభియాన్ ఆడిటోరియంలో డిపాజిట్లపై ఏర్పాటుచేసిన శిబిరాన్ని శుక్రవారం ఆర్ఎఒ అంకిత్‌కుమార్ ప్రారంభిస్తారని ఇండియన్ బ్యాంకు మేనేజర్ టిఎల్ఎన్.పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని డిసెంబర్ 25 వరకు అన్ని బ్యాంకులు శాఖలు, బీమా కంపెనీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున సంబంధిత వ్యక్తులు గుర్తింపు పత్రాలు, రుజువులతో ఈ శిబిరంలో పాల్గొని క్లయిమ్ చేయని మొత్తాలను తిరిగి పొందాలని కోరారు.

మాజీ ఎంఎల్ఎ హరికృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

మాజీ ఎంఎల్ఎ రక్షా హరికృష్ణకు సమాచార శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ అంకిత్‌కుమార్, ఎస్‌పి వరదరాజన్ పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పుణీత్ రాజ్, శేరు నూకరాజు, హరికృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జెపిఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక గుర్రంపాలెం రోడ్‌లోని గ్రౌండ్లో జగ్గంపేట ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) సీజన్ 6 క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ క్రికెట్ పోటీలను టిడిపి మండల అధ్యక్షులు జీను మణిబాబు ప్రారంభించారు. జగ్గంపేట టౌన్ నుంచి ఆరు జట్లు పాల్గొన్నాయి. వారం రోజులపాటు ఈ పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ రాజు, రాయి సాయి, పీలా మహేష్, నండ్ల చిరంజీవి, నలమాటి ఆనంద్, బండారు నాని, హరి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో 'అధజల్ గగరీ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ హిందీ ఉపాధ్యాయుడు సత్యప్రకాష్ సింగ్ రచించిన 'అధజల్ గగరీ' పుస్తకాన్ని విజయనగరం జిల్లా జవహర్ నవోదయ టిజిటి హిందీ ఉపాధ్యాయులు ఎంవి.సుబ్బారావు ఆవిష్కరించారు. గురువారం స్థానిక నవోదయ విద్యాలయంలో నవోదయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పుస్తకంలోని అంశాలు, పుస్తక ప్రాముఖ్యతను వివరించారు. సభా సంచాలకులుగా ఎం.భాస్కరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యానాం నవోదయ విద్యాలయ హిందీ ఉపాధ్యాయుడు పి.రామారావు, అధ్యాపకులు చక్రవర్తి పాల్గొన్నారు.




విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎంఇఒ శివరామకృష్ణయ్య

వేట్లపాలెం హైస్కూల్లో తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం జడ్‌పి హైస్కూల్‌ను ఎంఇఒ-1 వై. శివరామకృష్ణయ్య గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ యాక్షన్ ప్లాన్‌ను ప్రతిరోజూ సాయంత్రం స్లిప్ టెస్ట్‌లు నిర్వహించి, వాటి మార్కులను లీప్ యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు వివరాలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

వెదజల్లు పద్ధతిని పాటించాలి

ప్రజాశక్తి - కరప

ఈ నెలాఖరులోపు వెదజల్లు విధానంలో విత్తనాలు చల్లుకోవాలని వ్యావసాయ శాఖ జెడి డాక్టర్ ఎన్.విజయ్ కుమార్ సూచించారు. గురువారం కరప నీటి సంఘం నాయకులు పీజీ సత్యనారాయణతో కలిసి ఆరట్లకట్ల గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పూడికతీత పనులు ఈనెల 19 నుంచి మొదలుపెట్టి, నాలుగైదు రోజుల్లో పనులు పూర్తి చేస్తారని అన్నారు. రైతులంతా ఈ నెలాఖరు లోపుగా ఎద విధానంలో విత్తనాలు చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, డిసి పిజి.సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళీ, జెడ్ భావారం సొసైటీ అధ్యక్షులు గంట వీరన్నచౌదరి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



జగన్‌తో కరచాలనం చేస్తున్న ముదునూరి

జగన్‌ను కలిసిన ముదునూరి

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

వైసిపి అధినేత వైఎస్.జగన్‌ను నరసాపురం పార్లమెంట్ వైసిపి పరిశీలకులు ముదినూరి మురళీకృష్ణంరాజు గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సేకరించిన కోటి సంతకాల ప్రతులను జగన్‌తో కలిసి గవర్నర్‌కు అందజేయడం జరిగిందని మురళీకృష్ణంరాజు స్థానిక మీడియాకు తెలిపారు. కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.